సాక్షి నిజామాబాద్

శనివారం । 26 । అక్టోబర్ । 2024



నిరుపయోగంగా..

జిల్లాలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి.

- 10లో ▸



ఆయుధాలపై అవగాహన

నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 / 17.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన గడుగు గంగాధర్



నిజామాబాద్ సిటీ: హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం పలువురు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిశారు. సీఎం చాంబర్‌లో తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, కమిషన్ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం జిల్లాకు చెందిన నాయకులు, ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేశవరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. గత మూడు రోజులుగా జరిగిన క్రీడాపోటీల్లో సాలూరా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కార్యక్రమానికి తహసీల్దార్ కిరణ్మయి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. డీసీవో శ్రీకర్, ప్రిన్సిపాల్ అనూష, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సృజన, హైమావతి, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్ నుంచి అరుణాచలంకు బస్సు సౌకర్యం



బోధన్: కార్తీక పౌర్ణమి రోజున అరుణాచల గిరి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం బోధన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. నవంబర్ 13న సాయంత్రం 3 గంటలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. 14న రాత్రి అరుణాచలం చేరుకుని, మరుసటి రోజు అక్కడి నుంచి బయలుదేరి 16న సాయంత్రం బోధన్‌కు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.4,400, పిల్లలకు రూ.3,600 టికెట్ ధర ఉంటుందన్నారు. వివరాల కోసం 9959226001, 7382843403 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి


- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకాలు వేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు పడుతుండటంతో వడ్లు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం సేకరించాలన్నారు. యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని, కానీ డీకేఏఎల్‌బీ-డీకేసీ 9217, ఏడీవీఏఎస్‌టీఏ - పీఏసీ 741 వంటి విత్తనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా రకం విత్తనాలను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు లేఖలో కోరారు.

పాలన పట్టాలెక్కిస్తా!



మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరి రావు



తెలంగాణ యూనివర్సిటీలో పాలనను క్రమబద్ధీకరిస్తానని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరి రావు స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో వర్సిటీ పరిపాలనకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తానని, అందుకు అనుగుణంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో వీసీ యాదగిరిరావు పలు అంశాలపై వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సాక్షి ఇంటర్వ్యూ

ప్రతి అంశం నిశిత పరిశీలన

- క్రమం తప్పకుండా కాన్వొకేషన్ నిర్వహించేలా చర్యలు
- ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వ్యాల్యుయేషన్ అక్రమాలలో ప్రక్షాళన
- గత పాలకమండలి తీర్మానాలు క్షుణ్ణంగా పరిశీలించి అమలుకు కృషి
- 2014 నియామకాలకు సంబంధించి కోర్టు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం
- 'సాక్షి' ముఖాముఖిలో తేయు వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

ప్రశ్న : న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సాధింపు?

జవాబు : న్యాక్ సాధించేందుకు క్రమపద్ధతి ప్రకారం ముందుకు వెళతాం. ఏక్యూఏఆర్ (యాన్యువల్ క్వాలిటీ అస్యూరెన్స్ రిపోర్టు), ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్), ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్టు) వీటిన్నింటినీ కచ్చితమైన విధానంలో సబ్మిట్ చేసి న్యాక్ సాధిస్తాం.

■ కీలకమైన కాన్వొకేషన్ నిర్వహణ ?

■ యూనివర్సిటీలో కాన్వొకేషన్ నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఇంత కీలకమైన కాన్వొకేషన్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదు. గత 18 ఏళ్లలో కేవలం ఒక్కసారి మాత్రమే కాన్వొకేషన్ నిర్వహించిన విషయం తెలిసి ఆశ్చర్యపోయాను. ఇప్పటి నుంచి క్రమం తప్పకుండా కచ్చితంగా కాన్వొకేషన్ నిర్వహించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటా. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అకడమిక్, రీసెర్చ్ యాక్టివిటీలను పటిష్టం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తా. పరిపాలనాపరమైన మార్పుల కు సంబంధించి కచ్చితమైన అవగాహన వచ్చాక అందుకనుగుణంగా ముందుకెళతా.

■ వివాదాస్పద 2014 నియామకాల ప్రమోషన్ల వివాదంపై..?

■ 2014 వివాదాస్పద నియామకాల విషయం ప్రస్తుతం కోర్టులో ఉంది. కోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు, ఆ తరువాత ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ వచ్చే వరకు ఈ విషయంపై తగిన విధంగా ముందుకు వెళతాం. ఇంతకు మించి ఎలాంటి ఇతరత్రా వ్యవహారాలు ఉండవు.

■ ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వెరిఫికేషన్‌లో అక్రమాలు ?

■ ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వెరిఫికేషన్ అక్రమాలపై పకడ్బందీగా వ్యవహరిస్తా. ఒక్కో స్క్రిప్ట్‌కు రూ.12 లకు ఇవ్వడం సబబు. అంతకంటే ఎక్కువ ఇవ్వడమంటే లెక్క తప్పినట్లే. ఇందుకు సంబంధించి కేవలం రెండు కొటేషన్లు మాత్రమే వచ్చాయి. కనీసం మూడు కొటేషన్లు వస్తేనే ముందుకెళతాం. అయితే రూ.12 లకే చేస్తామంటే మాత్రం వెంటనే అప్పగిస్తాం.

■ బాలికల వసతి గృహాల కొరతపై..?

■ యూనివర్సిటీలో బాలికల వసతి గృహాల సమస్య ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.7 కోట్ల 'రూసా' నిధులతో వసతిగృహాలు నిర్మిస్తాం. ఇందుకు సంబంధించి టెండర్లు పిలుస్తాం.

■ అవకతవకలు, అక్రమాల నేపథ్యంలో గత పాలకమండలి తీర్మానాల అమలు విషయమై, మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినిలపై చర్యలు తీసుకోవాలనే సిఫార్సులపై..?

■ వర్సిటీలో అక్రమాలు, అవకతవకల విషయమై ఇప్పటికే ఏసీబీ, విజిలెన్స్ విచారణ నడుస్తోంది. కాగా కీలక అంశాలు, వ్యవహారాలపై గత పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యల గురించి సిఫారసు చేసిన చర్యల విషయమై ప్రతి అంశాన్ని పరిశీలించి తగినవిధంగా ముందుకెళతా. కచ్చితమైన చర్యలు ఉంటాయి.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రుద్రూర్ పీహెచ్‌సీలో రక్త పరీక్షల రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



రుద్రూర్ హైస్కూల్‌లో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్

- సిబ్బంది అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

రుద్రూర్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రిజిష్టర్లు, వైద్య సదుపాయాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పరిస్థితి ఎలా ఉందని ప్రశ్నించారు. పీహెచ్‌సీ పరిధిలో గత నెలలో ఏడు డెంగీ కేసులు నమోదు కాగా, ఈ నెలలో ఇప్పటి వరకు కేవలం రెండు కేసులు మాత్రమే వచ్చాయని, సీజనల్ వ్యాధుల తీవ్రత కూడా తగ్గుతోందని పీహెచ్‌సీ వైద్యులు ఆయేషా సిద్ధిఖా కలెక్టర్‌కు దృష్టికి తెచ్చారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి

రుద్రూర్ మండల కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో వేర్వేరుగా నిర్వహిస్తున్న తరగతులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. విద్యాబోధన, డిజిటల్ తరగతుల నిర్వహణ గురించి వివరాలు తెలుసుకున్నారు. 9వ తరగతిలో విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్కూల్‌లో ఆవరణలో మధ్యాహ్నభోజనం వంట చేయడం గమనించిన కలెక్టర్ వంట గది ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించే భోజనం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించేటట్టు నిత్యం పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ వెంట పీఆర్ ఈఈ శంకర్, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.


గల్ఫ్ మృతులు 35 మంది

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల

మోర్తాడ్(బాల్కొండ): పొట్ట చేతపట్టుకుని గల్ఫ్‌దేశాలకు వలస వెళుతున్న వారిలో కొంత మంది మృత్యువాత పడుతున్నారు. గడచిన 10 నెలల్లో రాష్ట్రానికి చెందిన 129 మంది గల్ఫ్ దేశాల్లో మరణిస్తే అందులో అత్యధికంగా జిల్లాకు చెందిన 35 మంది ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా కోసం నిధులను విడుదల చేసింది. 15 జిల్లాల్లోని 129 కుటుంబాల కోసం రూ. 6.45 కోట్లు విడుదల చేయగా అత్యధికంగా రూ.1.75 కోట్లను నిజామాబాద్ జిల్లాకు కేటాయించారు. జగిత్యాల్ జిల్లాకు చెందిన వారు 28 మంది ఉండగా ఆ జిల్లాకు రూ.1.40 కోట్లు విడుదల చేశారు. మిగిలిన జిల్లాలకు రూ.20లక్షల నుంచి రూ.60లక్షల వరకు నిధులను కేటాయించారు. ప్రభుత్వ రికార్డులలో నమోదైన సంఖ్య ప్రకారం గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం మంజూరైంది. 2023 డిసెంబర్ 7 తర్వాత మరణించిన వారి కుటుంబాలకే పరిహారం అందుతుంది. కటాఫ్ తేదికి ముందు అనేక మంది మృత్యువాత పడినా ప్రభుత్వం పరిహారం అందించడం లేదు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాక ముందు మరణించిన వారి కుటుంబాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సాయం అందించాలని వలస కార్మికుల సంక్షేమ సంఘాలు కోరుతున్నాయి.

పశు గణన సక్రమంగా జరిగేనా?

- జిల్లాలో మొదలైన కార్యక్రమం
- గతంలో ప్రభుత్వానికి బోగస్ లెక్కలు ఇచ్చారని ఆరోపణలు
- ఈసారి కచ్చితమైన పశు గణన చేయాలంటున్న పాడి రైతులు



డొంకేశ్వర్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశు గణన జిల్లాలో మొదలైంది. ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు మూడు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఐదేళ్లకోసారి జరిగే పశు గణనను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి పశుసంవర్ధక శాఖకు ఆదేశాలందాయి. పశువుల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. పశువైద్య అధికారులు, సిబ్బంది, గోపాల మిత్రలు క్షేత్రస్థాయిలో ప్రతి పాడి రైతు కుటుంబం వద్దకు వెళ్లి పశుగణన చేయాల్సి ఉంటుంది. ఐతే, 2018లో జరిగిన పశు గణనపై ఆరోపణలు ఉన్నాయి. అప్పుడున్న పశు వైద్య అధికారులు తీసిన లెక్కలను బోగస్‌గా సృష్టించి ప్రభుత్వానికి తప్పుడు వివరాలను అందించారంటున్నారు. పశువుల సంఖ్య తక్కువగా ఉందనే కారణం చేత ఎక్కువగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో అవసరానికి మంచి జిల్లాకు టీకాలు, మందులు ఎక్కువగా వస్తున్నాయని సమాచారం. తద్వారా ప్రభుత్వానికి కూడా ఖర్చు పెరిగిందనే చెప్పవచ్చు. మందులు, టీకాలు తప్పుదారి పట్టాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇలాంటివి జరగకుండా ప్రస్తుతం చేపడుతున్న పశు గణన సక్రమంగా ఉందో లేదో తెలుసుకునేందుకు థర్డ్ పార్టీ ద్వారా తనిఖీలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు. 2019లో చేపట్టిన పశు గణన ప్రకారం జిల్లాలో లక్షకు పైగా ఆవులు, ఎడ్లు, 2 లక్షల పైగా గేదెలు ఉన్నాయి. గొర్రెలు, మేకలు కలిపి 8 లక్షల వరకు ఉన్నాయి. ఇప్పుడు చేపట్టే గణలో వీటి సంఖ్య తగ్గే అవకాశముంది.

పోస్టర్ ఆవిష్కరణ

పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అంకిత్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. గణన చేపట్టేందుకు పశువైద్య సిబ్బంది మొత్తం 109 మంది, 23 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. అంతకు ముందుకు పశు వైద్య సిబ్బందితో ఆశాఖ జేడీ సమావేశం నిర్వహించారు. గతంలో మాదిరిగానే పశువుల గణాంకాలు పెంచి ఇవ్వాలా అని ఓ పశు వైద్య అధికారి జేడీని అడిగినట్లు తెలిసింది. దీనిని బట్టే గతంలో జిల్లాలో జరిగిన పశు గణన ఏ విధంగా జరిగిందో అర్థం అవుతోంది.



గణన పక్కాగా నిర్వహించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు పశుగణన పూర్తి చేస్తాం. గణన చేసేందుకు పశువైద్య సిబ్బందితో పాటు పర్యవేక్షకులను నియమించాం. తప్పుడు లెక్కలు నమోదు చేయవద్దని కచ్చితమైన ఆదేశాలిచ్చాం. అలా చేసిన వారిపై చర్యలు తప్పవు.

– జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

డిమాండ్ ఉన్నా.. రైతుకు దక్కని ధర

- పొరుగు రాష్ట్రాలతో పాటు విదేశాలకు సోయా ఎగుమతి
- 500 మెట్రిక్ టన్నులు సేకరించాలని రంగంలోకి దిగిన బడా వ్యాపారులు



తిమ్మాపూర్‌లో సోయాను విక్రయిస్తున్న రైతులు



ఎగుమతుల కోసం తరలిస్తున్న సోయా

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో సాగైన సోయాకు పొరుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో డిమాండ్ ఉందని వ్యాపారులే చెబుతున్నారు. అయితే రైతులకు మాత్రం తగిన ధర చెల్లించడానికి ముందుకు రావడం లేదు. ఎగుమతులకు డిమాండ్ ఏర్పడినా తమ పంటకు ఎక్కువ ధర లభించకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. 500 మెట్రిక్ టన్నుల సోయాను ఎగుమతి చేయడానికి ఆర్డర్ ఉందని బడా వ్యాపారి ఒకరు తన అనుయాయులతో సోయా కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నారు. కాగా క్వింటాలుకు రూ.4,400 మించి ధర చెల్లించడం లేదు. సోయా కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆరంభించి క్వింటాలుకు రూ.4,892 మద్దతు ధరగా నిర్ణయించింది. తేమ శాతం 12 ఉండాలనే నిబంధన అమలు చేస్తున్నారు. వ్యాపారులు తేమ శాతం 10 ఉన్నా సోయాను కొనుగోలు చేస్తున్నారు. ఏ రోజు కొనుగోలు చేసిన సోయాను అదే రోజు తరలిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వంట నూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో సోయాకు డిమాండ్ ఏర్పడింది. సోయా ధర గతంలో రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు పలికింది. ఈసారి సోయా కొనుగోళ్లు చేస్తున్న పెద్ద వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర గ్రామాలలో సోయాకు రూ.5 వేల వరకు ధర చెల్లిస్తున్నారని, ఈ ప్రాంతంలోనే ధర తగ్గించారని కొందరు రైతులు వెల్లడించారు.సోయా కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనుగోళ్లు సాగకపోవడం, నిబంధనలు కఠినంగా ఉండటంతో రైతులు తమ ఇంటి ముందుకు వచ్చే వ్యాపారులకే సోయా విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు.

కొనుగోలు పరిమితి పెంపు..

సోయా కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొంత వెసులుబాటును కల్పించింది. దిగుబడులతో సంబంధం లేకుండా ఒక ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల లెక్కననే సోయా కొనుగోళ్లు సాగించాలని మొదట్లో నిర్ణయించారు. ఫలితంగా సోయా దిగుబడులు ఎక్కువ పొందిన రైతులు కొంత సోయా గింజలను కొనుగోలు కేంద్రంలో మిగిలిన పంటను వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల ఆందోళనతో ప్రభుత్వం ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడులను కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాలను జిల్లాలో 12 చోట్ల ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లాలో 10 వేల క్వింటాళ్ల సోయా సేకరించారు. కొనుగోళ్లు ఇంకా కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు.

వ్యాపారి నిర్ణయించిందే ధర



సోయాకు మహారాష్ట్రలో క్వింటాలుకు రూ.5 వేల వరకు ధర చెల్లిస్తున్నారు. జిల్లాలో ప్రత్యేకించి ఆర్మూర్ డివిజన్‌లో సోయా దిగుబడి ఎక్కువ రావడం, కొనుగోలు కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండటంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే సోయాను విక్రయించాల్సి వస్తుంది. వ్యాపారులు పెద్ద మనసు చేసుకుని ధర పెంచితే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

– మామిడి చిన్నారెడ్డి, రైతు, దొన్కల్

రైతులు ఎంత తెచ్చినా సోయా కొనుగోలు చేస్తాం

సోయా కొనుగోళ్ల పరిమితిని పెంచాం. గతంలో ఆరున్నర క్వింటాళ్లు కొనుగోలు చేయగా ఇప్పుడు పది క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తున్నాం. జిల్లాలో సోయా సేకరణకు టార్గెట్ అంటూ ఏమి లేదు. ఎంత మొత్తంలో సోయాను రైతులు తీసుకువచ్చినా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– రంజిత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

ముమ్మరంగా ట్రాక్ పునరుద్ధరణ పనులు



మాధవ నగర్ వద్ద కొనసాగుతున్న రైల్వే ట్రాక్ పనులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ వద్ద గల రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రైల్వేగేట్‌ను అధికారులు మూసివేశారు. మరమ్మతుల కారణంగా ఈనెల 25నుంచి 27వరకు రైల్వే గేటు మూసి ఉంటుందని ఇదివరకే అధికారులు తెలిపారు. ట్రాక్ వద్ద పనులు ఎక్కువ మొత్తంలో ఉండడంతో అనుకున్న సమయానికి రైల్వేగేటు తెరుచుకుంటుందోలేదోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కంఠేశ్వర్ బైపాస్‌కు వెళ్లే రోడ్డు వద్ద, బోర్గాం వద్ద, మాధవనగర్ గ్రామం వద్ద గేటు మూసి నట్లు ఇప్పటికే ట్రాఫిక్ పోలీస్‌సిబ్బంది ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులందరు బైపాస్ గుండా వెళ్లలంటూ సూచించారు.

ఏటీసీలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కార్మిక, ఉపాధికల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి సంజయ్



వీసీలో మాట్లాడుతున్న కార్మిక, ఉపాధి కల్పన శిక్షణ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్: మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లో అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి సంజయ్ కుమార్ సూచించారు. ఏటీసీల నిర్మాణం, నూతన కోర్సుల్లో అడ్మిషన్లపై ఆయన శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏటీసీ భవనాల పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. వీటి నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు ప్రభుత్వ ఐటీఐలలో ఏటీసీ కోర్సులను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఏటీసీ కేంద్రాల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వివరించారు. ప్రవేశాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ పురోగతి సాధించామని తెలిపారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఏటీసీ కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులలో చేరేందుకు అర్హులని తెలిపారు. ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు నిజామాబాద్ ప్రభుత్వ బాలుర(పాత) ఐటీఐ, బోధన్ ప్రభుత్వ ఐటీఐ, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐలో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావొచ్చని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే కారును ఢీకొట్టిన లారీ



సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఎమ్మెల్యే హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద కారు డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక నుంచి వచ్చిన లారీ కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు అద్దం పగిలింది. ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదు.

శాసనమండలి చైర్మన్‌కు రికార్డ్ అసిస్టెంట్ల వినతి



మోపాల్: తమకు జూనియర్ రెవెన్యూ అధికారిగా అవకాశం కల్పించాలని తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. జీఆర్‌వోలుగా అవకాశం కల్పిస్తూనే సొంత జిల్లాలకు పంపించాలని రికార్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి వీరన్న కోరారు. నాయకులు సాయినాథ్, పృథ్వీరాజ్, సంతోష్, సాయన్న ఉన్నారు.

సాలూర చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష సీజ్

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూరలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రూ.లక్ష సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ధన్‌రాజ్ రూ.లక్ష నగదు తీసుకొని బోధన్ వైపు వస్తుండగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

లక్కీ కాయిన్ నిర్వాహకుల అరెస్ట్

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద శుక్రవారం లక్కీ కాయిన్ ఆట నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేశారు. పెర్కిట్‌కు చెందిన సుంకరి వెంకన్న, ఆర్మూర్‌కు చెందిన షేక్ దావుద్‌లను మెండోరా ఎస్సై నారాయణ అరెస్ట్ చేశారు. పోచంపాడ్‌లో లక్కీ కాయిన్ ఆటపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి కాపు కాసి వారిని పట్టుకున్నారు.

పనులు పూర్తి చేయాలి

- వీసీ యాదగిరిరావు
- క్యాంపస్‌లోని పలు భవనాల సందర్శన



తెయూ గర్ల్స్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలోని సైన్స్ కాలేజీ భవనం పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని వీసీ టి యాదగిరిరావు సూచించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న సైన్స్ కాలేజీ పనులను రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి వీసీ పరిశీలించారు. ల్యాబ్‌లు, తరగతి గదులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం న్యాయ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను వీసీ సందర్శించారు. వర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహంలోని బాలికలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. హాస్టల్ చుట్టుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని హాస్టల్ వార్డెన్ కిరణ్మయి, చీఫ్ వార్డెన్ మహేందర్‌ను ఆదేశించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరమే..

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. శుక్రవారం క్యాంపస్ క్రీడామైదానంలో తెయూ ఇంటర్ కాలేజీ బ్యాడ్మింటన్ (మెన్) సెలెక్షన్స్ నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన ఐదుగురిని ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్‌బాలకృష్ణ తెలిపారు. వీరు ఈ నెల 26 నుంచి 29వరకు చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

నీకేష్, ఉమేష్ (గిరిరాజ్ డిగ్రీ కాలేజీ), అనిల్, సాయికుమార్ (తెలంగాణ యూనివర్సిటీ), రోహన్ (గిరిజన సంక్షేమ డిగ్రీ కాలేజీ, కామారెడ్డి).

కష్టపడితే బంగారు భవిష్యత్తు

తెయూ(డిచ్‌పల్లి)/భిక్కనూరు: విద్యార్థులు కష్టపడితే బంగారు భవిష్యత్ ఉంటుందని తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు. తెయూ సౌత్‌క్యాంపస్ జువాలజీ విభాగం మొదటి బ్యాచ్ విద్యార్థులు ముగ్గురు హాల్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన డి సరిత, ఎం అవినాష్, అజయ్‌గౌడ్‌కు శుక్రవారం వీసీ, రిజిస్ట్రార్ యాదగిరి ఆర్డర్ కాపీలను అందజేశారు. జువాలజీ హెచ్‌వోడీ ప్రసన్న శ్రీల, సౌత్ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు సునీల్ కుమార్, విజయ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన





విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, బెటాలియన్‌లో..

ఖలీల్‌వాడి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) కోటేశ్వరరావు ఈ కార్యాక్రమాన్ని ప్రారంభించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదనపు పోలీస్ కమిషనర్(ఏఆర్) శంకర్‌నాయక్, ఆర్మ్‌డ్ రిజర్వు ఏసీపీ నాగయ్య, ఫొరెన్సిక్ హెచ్‌వోడీ నాగమోహన్‌రావు, రిజర్వు సీఐ సతీష్ కుమార్, కాకతీయ మహిళా కాలేజీ, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నిశిత డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో శుక్రవారం ఓపెన్ హౌజ్ నిర్వహించారు. బెటాలియన్ చుట్టుపక్కల గల పాఠశాలల విద్యార్థులకు అధికారులు ఆయుధాలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ కేపీ సత్యనారాయణ, ఆర్ఐలు పి వెంకటేశ్వర్లు, బి శ్యాంరావు, బి వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చొరవతోనే కొత్త పంచాయతీలు

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చొరవతోనే కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకవచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. భీమ్‌గల్, ఏర్గట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను శుక్రవారం వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ గిరిజనుల కలను సాకారం చేయడానికి భీమ్‌గల్‌లో రూ.50 లక్షలతో బంజారా భవనం నిర్మించామన్నారు. ఆ భవనం ప్రహరీ నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ.17లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.



భీమ్‌గల్ మండలం సుదర్శన్ నగర్ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

జాతరకు ఆహ్వానం

లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మి నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని పురోహితులు ఆహ్వానించారు. శుక్రవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో భీమ్‌గల్, ఏర్గట్ల మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

నందిపేట్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి గత ప్రభుత్వ హయాంలో ఊరూరా క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. వీటి కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఒత్తిడి చేశారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ వాటిని ఏర్పాటు చేశారు. జిల్లాలో చాలా వరకు చెరువులు, నీటి పరివాహాక ప్రాంతాలు, గుట్టలు, పాఠశాల ఆవరణల్లో ఆట స్థలాలు ఏర్పాటు చేశారు. వాటిలో వ్యాయామ పరికరాలు, వాలీబాల్, ఖోఖో పోల్స్ పెట్టారు. అయితే వాటి నిర్వాహణను పట్టించుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలు పెరిగిపోయి, నిరుపయోగంగా మారాయి. ఆట సామగ్రి, కిట్లు ఎక్కడికి వెళ్లాయో కూడా తెలియడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది.



నందిపేట మండలం శాపూర్ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

వాడుకలోకి తీసుకురావాలి

జిల్లాలో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని వాడుకలోకి తీసుకురావాలి.



– నరేందర్, శాపూర్

బాగు చేయిస్తాం

అప్పట్లో స్థలాలు లేక ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిక చేసిన చోటా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. ఆటలు ఆడేందుకు వీలు లేకుండా ఉన్న వాటిని గుర్తించి బాగు చేయిస్తాం. పిచ్చి మొక్కలు తొలగించేలా చూసాం.

– ఎం శ్రీనివాస్, ఇన్‌చార్జి డీపీవో

కామారెడ్డికి 'కుడా'!

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. దీని పరిధిలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాలతోపాటు వాటి చుట్టుపక్కల ఉన్న 460 గ్రామాలను చేర్చారు. సమగ్రమైన ప్రణాళికతో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి చేయడానికి 'కుడా' దోహదపడనుంది. రహదారుల అభివృద్ధి, నీటి సరఫరా, ఉపాధి, సమగ్ర మాస్టర్ ప్లాన్, శాటిలైట్ టౌన్‌షిప్‌లాంటి అభివృద్ధి పనులు చేయడం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యం. కుడా ఏర్పాటుతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ..

కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతోపాటు, కమిటీని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరి దాన కిషోర్ జీవోను విడుదల చేశారు. ఆ జీవో ప్రకారం కమిటీకి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉంటారు. ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, డీఎంఏ అధికారి, డీటీసీపీ అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు.

స్కూల్ బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) శివారులో శుక్రవారం ఉదయం స్కూల్ బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొంది. వివరాలు.. ధర్మారం(బి) గ్రామానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను తీసుకెళ్లడానికి వెళుతుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలోని యూటర్న్ తీసుకుంటోంది. ఇంతలో నిజామాబాద్ నుంచి లోలం వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్కూల్ బస్సును చూసి తన బస్సును నిలిపివేశాడు. అంతలోనే కామారెడ్డికి వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు వెనక నుంచి లోలం బస్సును ఢీకొట్టింది. దీంతో లోలం బస్సు యూటర్న్ తీసుకుంటున్న స్కూల్ బస్సును ఢీకొంది. ఈ ఘటనతో స్కూల్ బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆర్టీసీ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సుల అద్దాలు పగిలిపోయాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.



ఘటన స్థలంలో బస్సులు

లింగంపల్లి శివారులో..

సదాశివనగర్: సదాశివనగర్ మండలం లింగంపల్లి శివారులో స్ప్రింగ్‌ఫీల్డ్స్ పాఠశాలకు చెందిన బస్సును, గాంధారి వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఒక విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

భూంపల్లిని సందర్శించిన జెడ్పీ సీఈవో



సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామాన్ని జడ్పీ సీఈవో చందర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. శానిటేషన్, పల్లె దవాఖాన, ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మధు జీపీ కార్యదర్శి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని ఆర్‌బీనగర్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని రైలుకు ఎదుగా వెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎడమ చేతిపై పచ్చబొట్టుతో ఆర్‌ఆర్ పటేల్ అని రాసి ఉంది. మృతుడి వయస్సు 35–40 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

రాజంపేట: మతి స్థిమితం లేని మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలం కొండాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నీరడి చంద్రవ్వ(50)కు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మతిస్థిమితం కూడా లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆమె తన తల్లిగారింటికి లింగాయిపల్లె వెళ్తానని చెప్పింది. ఆమె ఆరోగ్యం బాగా లేక పోవడంతో భర్త కిష్టయ్య వద్దన్నాడు. దీంతో అదే రాత్రి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా చంద్రవ్వ ఇంటి నుంచి వెళ్లిపోయింది. లింగాయిపల్లె వెళ్లిందేమోనని అక్కడ వాకబు చేయగా రాలేదన్నారు. రెండు రోజులుగా గాలించగా గ్రామ పరిధిలోని మామిడి చెరువులో శుక్రవారం ఉదయం మృతదేహం తేలింది. కాగా మతిస్థిమితం లేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.



చంద్రవ్వ(ఫైల్)

మనస్తాపంతో వృద్ధుడు..



నందిపేట్: నందిపేట మండలం ఉమ్మెడ శివారులో గల గోదావరి నదిలో దూకి ఆలూరుకు చెందిన కండెల నర్సయ్య(78) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు.. ఆలూరు గ్రామానికి చెందిన నర్సయ్య కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు భారం అవుతున్నానని మనస్తాపం చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

రాజంపేట: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలంలోని షేర్‌శంకర్ తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కాట్రోత్ శ్రీనివాస్ (26) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.



శ్రీనివాస్(ఫైల్)

మద్యం మత్తులో మేస్త్రీ..

ఇందల్వాయి: మద్యం మత్తులో మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా తిమ్మారెడ్డి పల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ జిలాని బతుకు దెరువు కోసం ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి వలస వచ్చాడు. ఇక్కడ మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో తాను పనిచేస్తున్న ఇంట్లోనే శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు చెప్పారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిద్రలో కరెంట్ షాక్ : యువకుడి మృతి



సదాశివనగర్: చార్జింగ్ పెట్టిన కరెంట్ వైర్ తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సదాశివనగర్ మండలం యాచారం తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తండాకు చెందిన మాలోత్ అనిల్(23) గురువారం పడుకునే ముందు ఫోన్ చార్జింగ్ పెడదామనుకున్నాడు. సాకెట్ దూరం ఉండటంతో ఎక్స్‌టెన్సన్ బాక్స్ మంచం వద్ద పెట్టుకొని చార్జింగ్ పెట్టాడు. అయితే రాత్రి నిద్రలో ఆ బాక్స్‌పై కాలు పడటంతో షాక్ కొట్టి చనిపోయినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ డ్రైవర్..

ఎల్లారెడ్డి: పొలం వద్ద విద్యుత్ తీగలు తాకడంతో షాక్ కొట్టి హార్వెస్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్ గ్రామంలో గురువారం చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువరాజ్ (40) పొలాలు కోయడానికి హార్వెస్టర్ తీసుకొని ఇక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో హార్వెస్టర్ నడుపుకుంటూ వెళ్తున్న సమయంలో ఆజామాబాద్ శివారులోని థావుర్యా నాయక్ పొలం వద్ద విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడు.

పాముకాటుతో ఇంటర్ విద్యార్థి..



నాగిరెడ్డిపేట: ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోసానిగారి శ్యాంరావు, అనసూజ దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. పాము ఇంట్లోకి ప్రవేశించి చిన్న కుమారుడు కృష్ణ(17)ను కాటు వేసింది. కొద్ది సేపటికి తనను ఏదో కరిచినట్లుందని కృష్ణ ఇంట్లో వారిని నిద్రలేపి చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెదక్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కృష్ణ ప్రస్తుతం గోపాల్‌పేటలోని సిద్ధార్థ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు.